# శరవేగంగా పాతబస్తీ మెట్రో విస్తరణ

- స్వచ్ఛందంగా ఆస్తులు ఇచ్చేందుకు 270 మంది ముందుకు
- 170 మందికి ఇప్పటికే రూ. 80 కోట్ల నష్టపరిహారం చెల్లింపు
- ప్రపంచస్థాయి నగరంగా హైదరాబాద్ అభివృద్ధిలో కీలకం కానున్న మెట్రో రైల్
- త్వరలో అందుబాటులోకి రానున్న మరో మూడు కారిడార్లు
- మొదటి - చివరి మైల్ కనెక్టివిటీ కార్యక్రమంలో మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి



**మన తెలంగాణ / హైదరాబాద్ :** పాతబస్తీ మెట్రో విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయని హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మెట్రో అభివృద్ధి పనుల కోసం స్వచ్ఛందంగా ఆస్థులకు ఇచ్చేందుకు 270 మంది యజమానులు ముందుకు రాగా వారిలో 170 మందికి ఇప్పటికే రూ. 80 కోట్ల నష్టపరిహారం చెల్లించినట్లు వెల్లడించారు. హైదరాబాద్ ప్రపంచంలోని ప్రముఖ నగరాలతో పోటీ పడాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా హైదరాబాద్‌లో మెట్రో రైల్ వ్యవస్థను నలుదిక్కులా విస్తరిస్తున్నట్లు చెప్పారు. 69 కిలోమీటర్ల తొలి అడుగుతో ప్రారంభమైన హైదరాబాద్ మెట్రోను దాదాపు 200 కిలోమీటర్లకు పైగా విస్తరించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. జెబిఎస్ నుంచి మేడ్చల్, శామీర్‌పేట్, ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి కొత్తగా మూడు కారిడార్లు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. శుక్రవారం ఈవీ జిప్ సంస్థ హైదరాబాద్ లో 'మొదటి చివరి మైల్ కనెక్టివిటీ' లో భాగంగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, క్యాబ్ లను ఎల్ ఎండ్ టీ ఎండీ కేవీబీ రెడ్డితో కలిసి ఎన్వీఎస్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ ఈవీ జిప్ తో సహా ఇప్పటి వరకు 9 సంస్థలు 'మొదటి చివరి మైల్ కనెక్టివిటీ' కింద తమ సేవలు అందిస్తున్నాయని చెప్పారు. రోజూ మెట్రో రైల్ లో ప్రయాణం చేస్తున్న సుమారు 5 లక్షల మందిలో 1.25 లక్షల మందిని ఈ సంస్థల వాహనాలు వారి వారి గమ్యాలకు చేరుస్తున్నాయని తెలిపారు. వీటిలో మహిళా ప్రయాణీకుల కోసం కూడా ప్రత్యేకంగా మహిళలే నడిపే ద్విచక్ర ఎలక్ట్రిక్ వాహనాలను ఇప్పుడు తొలిసారిగా 'ఈవీ జిప్ ఈషా' పేరున వారు ప్రవేశపెట్టడం జరిగిందని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. ఈ వాహనాలను వందకు పైగా పరేడ్ గ్రౌండ్స్, సికింద్రాబాద్ ఈస్ట్ స్టేషన్ల నుండి మల్కాజ్ గిరి, సైనిక్ పురి, ఈసీఐఎల్ వంటి ప్రాంతాలకు ఎక్కువగా నడుపుతున్నారని, వీటిని త్వరలోనే ఇతర స్టేషన్లకు, ప్రాంతాలకు విస్తరిస్తారని తెలిపారు. హైదరాబాద్ ని ప్రపంచ నగరాలకు ధీటుగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దార్శనికతను అందిపుచ్చుకుని మెట్రో రైలును విస్తరిస్తున్నామని చెప్పారు.

ఇప్పటికే పాత నగరంలో ఎంజీబీఎస్ నుండి చంద్రాయణగుట్ట వరకు ప్రారంభించిన రహదారి విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. మొత్తం ప్రభావిత 1100 ఆస్తులకు గాను 170 ఆస్తులకు నష్టపరిహారం రు.80 కోట్లు చెల్లించామని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. వచ్చే కొద్ది రోజుల్లో మరో 80 కోట్ల రూపాయల పరిహారం చెల్లించేలా ప్రభావిత ఆస్తుల ఓనర్షిప్ డాక్యుమెంట్ల పరిశీలన జరుగుతోందన్నారు. పరిహారం చెల్లించిన ప్రభావిత ఆస్థుల కూల్చివేతలు కూడా జోరుగా సాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ అండ్ టీ మెట్రో రైల్ సీనియర్ అధికారులు మురళీ వరదరాజన్, రిషి వర్మ, కియోలిస్ మెట్రో ఎండీ ఎస్.సి. మిశ్రా, ఈవీ జిప్ సంస్థ వ్యవస్థాపకులు శ్రీధర్ శివలెంక, సీతారాం చెరుకుపల్లి తదితరులు పాల్గొన్నారు.